క్లుప్తంగా

బంజరుదొడ్డిలో పశువులు

పెంచికల్‌పేట్: ఎల్కపల్లి గ్రామపంచాయతీ బంజరుదొడ్డిలో 20 రోజులుగా రెండు ఆవులు ఉన్నట్లు ఎల్కపల్లి(పి) పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత యజమానులు తమ పశువులను తీసుకెళ్లాలని, లేని పక్షంలో పంచాయతీ కార్యాలయంలో నియమ నిబంధనల మేరకు అప్రస్ నిర్వహిస్తామన్నారు.

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు


అవగాహన కల్పిస్తున్న పంచాయతీ కార్యదర్శి

పెంచికల్‌పేట్: స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని ఆయా పంచాయతీల్లో మంగళవారం స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం యాదగిరి, పంచాయతీ కార్యదర్శులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.
సిర్పూర్(టి): మండల కేంద్రంలోని డొనల్ ప్రాంతంలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో రాజేశ్వర్, ఈవో కృష్ణమూర్తి, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని 'ఆశ'ల వినతి


వినతిపత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

పెంచికల్‌పేట్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని ఆశా కార్యకర్తలు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఏళ్లుగా పనిచేస్తున్న తమకు ప్రభుత్వం సమాన పనికి సమాన వేతనం అందించడం లేదన్నారు. అంతకముందు పీహెచ్‌సీలో వైద్యాధికారి డా. నేహాకు వినతిపత్రం అందజేశారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి


సామగ్రి అందజేస్తున్న సర్పంచ్

బెజ్జూర్: యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని బెజ్జూర్ సర్పంచ్ అన్సార్ హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో గల క్రీడా మైదానంలో క్రీడాకారులకు మంగళవారం వాలీబాల్, నెట్ అందజేశారు. బీఎస్పీ నాయకులు రమేశ్, ఇస్తారి, ఖాజామియా, సల్మాన్ ఖాన్, బిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

షీటీమ్ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన

వాంకిడి: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు షీటీమ్ ఆధ్వర్యంలో మంగళవారం చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్, సైబర్‌క్రైం వంటి నేరాలకు గురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అత్యవసర సమయాల్లో డయల్ 100, షీటీమ్ ఆసిఫాబాద్ 8712670564 నంబర్లను సంప్రదించాలన్నారు. షీటీమ్ ఇన్‌చార్జి సునీత, సభ్యులు స్వప్న, శ్రీలత, ప్రిన్సిపాల్ సంపత్ పాల్గొన్నారు.

పెన్నులు, కాపీలు పంపిణీ


వాంకిడి: మండలంలోని కనర్‌గాం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వాసవి క్లబ్, ఆసిఫాబాద్ ఆధ్వర్యంలో మంగళవారం పెన్నులు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాలలోని 25 మంది విద్యార్థులకు మూడు చొప్పున పెన్నులు, నోటు పుస్తకాలు అందజేశారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

కౌటాల: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కాంబ్లే బాలాజీ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం మూడు దశాబ్దాలుగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నామన్నారు. నాయకులు నక్క శంకర్, రాజు, అశోక్, సత్యనారాయణ, విఠల్ పాల్గొన్నారు.


పెంచికల్‌పేట్: కొలువుదీరిన గణనాథుడు


దహెగాం:చౌకలో కొలువుదీరిన వినాయకుడు


దహెగాం: కాలేజీ రోడ్‌లోని గణేశుడు


ఆసిఫాబాద్: వాసవీ మందిరంలో..


జైనూర్‌లో..

కొలువుదీరిన గణనాథులు

జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని ఆయా మండలాల్లో సోమవారం వినాయక చవితి పురస్కరించుకొని గణేశ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో విభిన్న రూపాల్లో ఉన్న గణనాథులను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా జైబోలో గణేశ్ మహరాజ్ అంటూ భక్తులు సందడి చేశారు. ఆయా మండపాల్లో మహిళలు, యువకులు లంబోదరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉండ్రాళ్లు, లడ్డూలు, పూలు, పండ్లు నైవేద్యాలుగా సమర్పించారు. రాత్రి వేళ మండపాల వద్ద భజనా కార్యక్రమాలు నిర్వహించారు.

- దహెగాం/ పెంచికల్‌పేట్/ ఆసిఫాబాద్/ రెబ్బెన/సిర్పూర్(టి) /జైనూర్/ కౌటాల/ బెజ్జూర్

మానవహారంతో అంగన్‌వాడీల నిరసన


ఆసిఫాబాద్అర్బన్: నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ఆసిఫాబాద్అర్బన్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు తమ డిమాండ్ల సాధనకు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక దీక్షలు మంగళవారం 9వ రోజుకు చేరాయి. ఇందులో భాగంగా కలెక్టరేట్ నుంచి ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ చౌక్ వద్ద మానవహారాన్ని చేపట్టారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు శకూర్ వనిత, అంజలి, ధనలక్ష్మి, మంజుల, సులోచన, అరుణ, సువర్ణ, మమత, సూర్యమణి, తదితరులు పాల్గొన్నారు.

దహెగాంలో..
దహెగాం: అంగన్‌వాడీలు చేపడుతున్న నిరవధిక సమ్మె మంగళవారం 9వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు మండల కేంద్రంలో ర్యాలీ చేపట్టారు. అంగన్‌వాడీల డిమాండ్లను నెరవేర్చాలని నినాదాలు చేశారు. అంగన్‌వాడీలు వజ్రమ్మ, కల్పన, మమత, జయ, పద్మ, ఆయాలు పాల్గొన్నారు.

చింతలమానెపల్లిలో..
చింతలమానెపల్లి: అంగన్‌వాడీల సంక్షేమంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాల్వాయి హరీశ్‌బాబులు ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మె నిర్వహిస్తున్న అంగన్‌వాడీలకు మద్దతు తెలిపారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, మాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెండుగురె శ్యాంరావు, నాయకులు అశోక్, తిరుపతి గౌడ్, మల్లయ్య, బాపురావు, సత్యనారాయణ, పురుషోత్తం చారి తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెనలో..
రెబ్బెన: తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ ఉద్యోగులు చేపట్టిన సమ్మె మంగళవారం 9వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఒంటికాలిపై నిల్చొని నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా నాయకులు అంబాల ఓదెలు, అంగన్‌వాడీ టీచర్లు రాజేశ్వరి, చంద్రకళ, బాలమ్మ, మంజుల, సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

కౌటాలలో..
కౌటాల: అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మె కొనసాగింది. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని అంగన్‌వాడీలు పేర్కొన్నారు. సమ్మెకు ఎమ్మార్పీఎస్ సంఘం నాయకులు మద్దతు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు శ్యామల, జీజాబాయి, ఇందు, సుందరి, నాయకులు శంకర్, సత్యనారయణ, విఠల్, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో..
కాగజ్‌నగర్‌రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని సీడీపీవో కార్యాలయాన్ని మంగళవారం అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ముట్టడించారు. అంగన్‌వాడీల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వినోద్, అరుణ మాట్లాడుతూ సమ్మెలో ఉన్న అంగన్‌వాడీలను కేసీఆర్ ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడటం సరికాదన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ


బెజ్జూర్: మట్టివిగ్రహాలు పంపిణీ చేస్తున్న పద్మశాలీ సేవా సంఘం సభ్యులు


వాంకిడి: విగ్రహాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ తుకారాం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో వినాయక చవితి పురస్కరించుకొని సోమవారం మట్టి వినాయకులను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోనగిరి సతీశ్‌బాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. సుమారు 200 మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల ఆంజనేయులు, నాయకులు లింగయ్య, శ్రీకాంత్, సురిత, మంగ, శ్రీకాంత్, వేణుగోపాల్, మోహన్, సంజీవ్, తిరుపతి, ధర్మయ్య, సునీల్ పాల్గొన్నారు.

వాంకిడిలో..
వాంకిడి: వినాయక చవితి పురస్కరించుకుని పర్యావరణ సహిత మట్టి విగ్రహాలను పంపిణీ చేసినట్లు వాంకిడి సర్పంచ్ బండె తుకారాం అన్నారు. సోమవారం గ్రామ పంచాయతీ కేంద్రంలో స్థానికులకు 51 మట్టి విగ్రహాలు అందజేశారు. సింగిల్ విండో చైర్మన్ జబోరే పెంటు, వార్డు సభ్యులు సుశీల్, గుండయ్య, తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్‌లో..
బెజ్జూర్: మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని పరిరక్షించాలని పద్మశాలీ సేవా సంఘం అధ్యక్షుడు సామల తిరుపతి, ప్రధాన కార్యదర్శి తనికుట్ల వెంకటేష్‌లు కోరారు. వినాయక చవితి సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు.

ఓటరు నమోదుపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఐకేపీ సిబ్బంది

వాంకిడి: మండలంలోని ఖమాన, వాంకిడి, బంబార గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఐకేపీ ఆధ్వర్యంలో ఓటరు నమోదుపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం మహేష్ మహిళలకు ఓటు ప్రాముఖ్యత, వినియోగం వంటి అంశాలపై వివరించారు. ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకుని తమ వంతుగా ఓటు వినియోగించుకోవాలని సూచించారు. సీసీలు వేణుగోపాల్, భీంరావు, విఠల్, రమేశ్, వీవోఏలు యశోధ, ఆనంద్ పాల్గొన్నారు.

వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోవాలి


వాంకిడి: రక్తపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

వాంకిడి: మండలంలోని లంజన్‌వీర గ్రామంలో మంగళవారం వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సిబ్బంది సూచించారు. ఇంటింటికీ దోమల మందు పిచికారీ చేశారు. డ్రైడే నిర్వహించారు. వైద్యఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్, హెచ్ఏ భగవాన్‌దాస్, ఏఎన్ఎం సునంద పాల్గొన్నారు.

మార్లవాయిలో వైద్యశిబిరం
జైనూర్: మండలంలోని మార్లవాయి గ్రామంలో ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రి వైద్యసిబ్బంది మంగళవారం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఐటీడీఏ డీఎంహెచ్‌వో కుడ్రం బాలు మాట్లాడుతూ వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజు, సర్పంచ్ కనక ప్రతిభ, నాయకులు అడ వెంకటేశ్, కనక వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

స.హ. చట్టం బోర్డు ఏర్పాటు చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న ఆర్టీఐ కార్యకర్తలు

వాంకిడి: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన పోలీస్‌స్టేషన్‌లో సమాచార హక్కు చట్టం -2005 వివరాలను తెలియజేసే బోర్డు ఏర్పాటు చేయాలని ఆర్టీఐ జిల్లా అధ్యక్షుడు జాడి ప్రవీణ్ కుమార్ కోరారు. ఈ మేరకు మంగళవారం నూతన పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సాగర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కార్యకర్తలు రత్నం తిరుపతి, చునార్‌కార్ అరుణ్, రాజేశ్ ఉన్నారు.

స్వచ్ఛ అవార్డు పొందిన సర్పంచ్‌కు సన్మానం


సర్పంచ్ సుమలతను సన్మానిస్తున్న మహిళలు

రెబ్బెన: స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ 2023 జిల్లాస్థాయి ఉత్తమ గ్రామ పంచాయతీగా అవార్డు పొందిన గోలేటి గ్రామ పంచాయతీ సర్పంచ్ పోటు సుమలతను మంగళవారం రాత్రి గోలేటికి చెందిన మహిళలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ గోలేటి గ్రామపంచాయతీ చరిత్రలోనే మొట్ట మొదటిసారిగా ఉత్తమ పంచాయతీగా ఎంపిక కావడం హర్షనీయమన్నారు. సర్పంచ్ సుమలత మాట్లాడుతూ గ్రామస్తులు అందించిన సహకారంతో గోలేటి గ్రామ పంచాయతీ జిల్లాస్థాయి ఉత్తమ పంచాయతీగా ఎంపికైందన్నారు.

యధావిధిగా 'భగీరథ' కార్మికుల సమ్మె


నిరసన తెలుపుతున్న నాయకులు

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఎవరెస్ట్ కంపెనీ యాజమాన్యంతో మిషన్ భగీరథ కార్మికులు మంగళవారం జరిపిన చర్చలు విఫలం కావడంతో సమ్మెను యధావిధిగా కొనసాగిస్తున్నట్లు జేఏసీ నాయకుడు లోకేశ్ తెలిపారు. చర్చల అనంతరం పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్ద నిరసన తెలిపారు. యాజమాన్యం దిగివచ్చే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్మికులు, నాయకులు ప్రేమ్‌దాస్, రాజేష్, మోహన్, నరేశ్, సదు, ఉపేందర్, లింగయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల వినతి

కాగజ్‌నగర్‌రూరల్: తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సమగ్రశిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు మంగళవారం ఎమ్మెల్యే కోనేరు కోనేప్పకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తమకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, జీవిత బీమా, ఆరోగ్యబీమా, తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

కొనసాగుతున్న సమ్మె
ఆసిఫాబాద్‌రూరల్: న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని సమగ్రశిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మె మంగళవారం 23వ రోజు కలెక్టరేట్ ఎదుట కొనసాగింది. సంఘం అధ్యక్షురాలు విజయలక్ష్మి, నాయకులు సంతోష్, రమేశ్, మోహన్, సందీప్, మహేష్, నగేష్, రవి, స్వప్న, మమత, తిరుమల, యూటీఎఫ్ సంఘం జిల్లా నాయకులు హమంత్, ఊశన్న, ఇందులాల్, తదితరులు ఉన్నారు.

హెల్త్‌కార్డు దరఖాస్తులకు మరో అవకాశం

రెబ్బెన: సింగరేణి సంస్థలో పనిచేసి పదవీ విరమణ పొందిన ఉద్యోగులు సీపీఆర్ఎంఎస్ హెల్త్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు యాజమాన్యం మరో అవకాశం కల్పించిందని జీఎం రవిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. హెల్త్ కార్డు తీసుకోని మాజీ ఉద్యోగులు డిసెంబర్ 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బీఆర్ఎస్ పార్టీలో చేరికలు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని మోసం గ్రామానికి చెందిన వివిధ పార్టీల నుంచి పలువురు యువకులు మంగళవారం ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీ కండువా కప్పి యువకులను ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు.

నేటి నుంచి డీఎస్సీ ఉచిత కోచింగ్

కాగజ్‌నగర్‌రూరల్: కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం నుంచి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో డీఎస్సీ ఉచిత కోచింగ్ నిర్వహిస్తున్నట్లు కోనేరు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వంశీ తెలిపారు. శిక్షణా తరగతులను ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రారంభిస్తారన్నారు. జిల్లాలోని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

వాంకిడి: మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. ఎంపీపీ ముండె విమలబాయి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి అధికారులు అభివృద్ధి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

జన్కాపూర్ హెచ్‌ఎంగా ఉదయ్ బాబు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు బదిలీపై వచ్చి జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు ఉదయ్‌బాబును శాలువాతో సన్మానించారు. మండలంలోని బూర్గుడ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సతీశ్, వెంకటేశ్వర్లు, రమేశ్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

విగ్రహావిష్కరణ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కృష్ణారావు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్‌లోని దోబీఘాట్‌లో ఈనెల 26న చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను జడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు ఆవిష్కరించారు. రజక సంఘం పట్టణ అధ్యక్షుడు రాజేశ్, కార్యదర్శి కరుణాకర్, సభ్యులు కనకయ్య, లచ్చయ్య, బాపు, వంశీ, చంద్రయ్య, ఎల్లయ్య, పెంటయ్య, శంకరయ్య, లింగమయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఆందోళన


ఆందోళన చేస్తున్న బీఎస్పీ నాయకులు

కౌటాల: కౌటాల -తుమ్మిడిహెట్టి ప్రధాన రహదారిపై ఉన్న భారీ గుంతలు పాలకులకు కనిపించడం లేదా అని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి ప్రశ్నించారు. సోమవారం తుమ్మిడిహెట్టి రోడ్డుకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేస్తూ బీఎస్పీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మొగడ్‌దగడ్ చౌరస్తాలో ఆందోళన నిర్వహించారు. నాయకులు యశ్వంత్‌రావు, నవీన్, సాగర్, శంకర్, సందీప్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ కోసం మౌనదీక్ష


దీక్ష చేస్తున్న మొగడ్‌దగడ్ గ్రామస్తులు

కౌటాల(సిర్పూర్): నాణ్యమైన విద్యుత్ అందించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండలంలోని గుండాయిపేట విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట మొగడ్‌దగడ్ గ్రామస్తులు మౌనదీక్ష చేపట్టారు. లోవోల్టేజీతో ఇబ్బందులు పడుతున్నామని, తరచూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి బీఎస్పీ నాయకులు మద్దతు తెలిపారు. అనంతరం సమస్యలు పరిష్కరించాలని విద్యుత్‌శాఖ సిబ్బందికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉర్వత్ జీజాబాయి, నాయకులు సిడాం గణపతి, వానుపటేల్, ఖాలీం, బండు, సంజు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ బిడ్డకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న చాహత్ బాజ్‌పాయ్

దహెగాం: మండలంలోని చంద్రపల్లి గ్రామానికి చెందిన ఆదివాసీ విద్యార్థిని సంగర్స్ స్రవంతి నీట్‌లో ఉత్తమ ర్యాంకు పొంది ఎంబీబీఎస్‌లో సీటు సాధించగా ఆమె చదువుల కోసం ఆదివాసీ ఎడ్యూకేషన్ హెల్ప్‌లైన్ సెంటర్, ఏడబ్ల్యూడబ్ల్యూఏ ఆధ్వర్యంలో సోషల్ మీడియా దాతల ద్వారా సేకరించిన రూ. 51,000 నగదును ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ చేతుల మీదుగా అందజేశారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో స్రవంతికి ఆర్థిక సాయం అందించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో హెల్ప్‌లైన్ ప్రతినిధులు కుర్సింగ మారుతి, జైసేవా ఫౌండేషన్ అధ్యక్షులు దుర్వ ప్రశాంత్, రాజ్‌గోండ్ సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొడసం శంకర్, విషంరావ్‌లు పాల్గొన్నారు.